# 'ఓడిపోయిన చీకటి'

అగ్నిని కింద మీదులుగా పెట్టినా దాని జ్వాల పైకే ఎగిసినట్టుగా, ఎట్లాంటి దుఃఖం సంభవించిననూ ధైర్యవంతుడు ధైర్యాన్ని కోల్పోడు... అని భర్తృహరి ఉవాచ... పుట్టుకతో ఏదో ఒక వైకల్యం సంభవించి దాన్ని అధిగమించి జీవితంలో రాణించిన పలువుర్ని మనం చూస్తూ ఉంటాం... అట్లాంటివాళ్ల విజయగాథల్ని పత్రికల్లో చదువుతూ ఉంటాం.

అయితే జీవితం మధ్యలో అంగవైకల్యం కలిగితే మాత్రం దాన్ని భరించి అధిగమించి ధైర్యంగా జీవితాన్ని కొనసాగించడం చాలాచాలా కష్టం... అందుకు ఎంతో ఆత్మ విశ్వాసం కావాలి. దానితోపాటు ఆత్మీయులు సహకారం కూడా చాలా అవసరం.

ఈ మధ్యన నేనూ మిత్రుడు శంకరం ఢిల్లీ వెళ్లి తిరిగొస్తున్నాం... సాయంకాలం ఢిల్లీలో ఏ.పీ. ఎక్స్‌ప్రెస్ ఎక్కాం. మాతోపాటు ఇద్దరు వృద్ధ దంపతులూ వాళ్లబ్బాయి ఓ యువకుడూ కూడా ఎక్కారు.

ఆ యువకుడు తండ్రిని చేయిపట్టి నడిపిస్తూ తీసుకొచ్చి బెర్తుమీద కూచోబెట్టాడు.. పెద్దాయన చూపు మందగించి ఉంటుందనుకున్నాం.

కాసేపైన తర్వాత శంకరం అన్నాడు "మామా! గమనించినావా? ఆ పెద్దాయనకు పూర్తిగా చూపులేదు" అని... అవును ఏ శుక్లాలో అయి ఉండవచ్చు అనుకుని పట్టించుకోక పడకలేసాం...

ఉదయం లేచిం తర్వాత కాలకృత్యాలకి కూడా దగ్గరుండి తీసుకెళ్లాడా యువకుడు... 'సహబాష్' అనుకున్నాం... తర్వాత న్యూస్ పేపరుకొని తెచ్చి తండ్రి పక్కన కూచుని పేపర్ని సాంతం చదివి వినిపించాడు.. మాకు కుతూహలం ఎక్కువ కాసాగింది. తెలుగు వాళ్లే... హైదరాబాదే వస్తున్నారు.

ఎక్కడా? ఏమిటీ? కథాకమామిషు అడిగాం...

కొద్దిసేపు మౌనం తర్వాత పెద్దాయన తన కథ చెప్పుకొచ్చారు. పేరు పేరి సీతారామయ్య, కోస్తా ప్రాంతం వారు... పుటుకతో అంధత్వంగానీ, వృదాప్యంనించీ శుక్లాలు గానీ కాక ఆయన చూపు నట్టనడి యవ్వనంలో పోయింది. రాజస్థాన్‌లో ఏదో జర్మన్ మందుల కంపెనీలో ఉద్యోగమొస్తే ఏడాది బాబుతో భార్యని తీసుకుని వెళ్లి అక్కడ స్థిరపడ్డారు...

జీవితం సజావుగా ఆనందంగా సాగుతున్న సమయంలో ఓమాటు తీవ్రంగా జ్వరం వచ్చింది. ఏవో మందులు వేసుకున్నారు... ఆ మందులు వికటించాయి... చిన చిన్నగా చూపు మందగించసాగింది.

ఆఖరికి ఓ మూడు నెలల కాలానికి పూర్తి అంధత్వం ప్రాప్తించింది... ఇక దృష్టి పునః సంప్రాప్తి అసంభవం అని డాక్టర్లు తేల్చేసారు... భార్యాభర్తల హృదయాలు పగిలి పోయాయి.

కొడుకా! పసికందు... దేశమా? దేశంకాని దేశం... ఉద్యోగం ఉంటుందో పోతుందో తెలీదు. ఆయన పనిచేసే కంపెనీకి ఓ అర్జీ పెట్టుకున్నారు. అంధుడు చేయగల్గిన పని ఏదైనా ఉంటే అందులోకి తనని బదిలీ చేయమని.. కంపెనీ వారు సహృదయంతో ఆయన్ని రిసెప్షనులో వేశారు... కానీ జీతబత్తేలు తగ్గించారు..

కంపెనీవారి ఔదార్యం... సహచరి బాసట... కూడగట్టుకున్న ఆత్మస్థైర్యంతో సీతారామయ్యగారు చీకట్లోంచీ కాలు బైటికి పెట్టారు.

నడిచారు... తోడుగా భార్య... చిన్న చిన్నగా చీకటి జయించారు... కొడుకును డిగ్రీవరకూ చదివించి తమ కంపెనీలోనే ఓ చిన్న ఉద్యోగంలో చేర్పించారు... ఆ అబ్బాయి కూడా కష్టపడి ఉద్యోగం చేస్తూనే ఎం.బీ.ఏ. ప్యాసు అయ్యాడు... ఇప్పుడు లుఫ్తాన్సా ఏర్‌వేస్‌లో కార్గో విభాగంలో ఉన్నతమైన పదవిలో వున్నాడు... ఇప్పుడు సీతారామయ్య దంపతులకు తమ జీవిత చరమాంకాన్ని తెలుగు గడ్డ మీద గడపాలనుంటే... కొడుకు హైదరాబాద్‌లో వాళ్లకోసం ఓ ఫ్లాట్ కొని తీసుకువెళుతున్నాడు...

అదీ కథ...

ముసలితనంలో కూడా సీతారామయ్యగారి మొహంలో చీకటిని జయించిన వెలుగు, ఆయన భార్యాకొడుకుల మొహాల్లో ఆయన చీకటి యుద్ధంలో పక్కన నిల్చిన తృప్తి ప్రస్ఫుటంగా కనబడుతోన్నాయి.

సీతారామయ్యగారిలాంటి వాళ్లు మనకు అక్కడక్కడా తారసపడుతూనే ఉంటారు.. వీలైతే మనమూ వాళ్ల పోరాటానికి చేయగలిగింది చేద్దాం... ●